క్లుప్తంగా

మండల వ్యాప్తంగా ఆధార్ అనుసంధానం



చాగంటివారిపాలెంలో పరిశీలిస్తున్న ఆర్ఐ ఆంజనేయులు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానంపై ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు ఆధార్ అనుసంధానం చేపట్టారు. ముప్పాళ్ళ, మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలను తహసీల్దార్ ఎం.భవానీశంకర్ పరిశీలించారు. గోళ్ళపాడు, కుందురువారిపాలెంలో డీటీ సీహెచ్ లక్ష్మీప్రసాద్, ఆర్ఐలు ఆంజనేయులు, కపిల్‌దేవ్ పలు గ్రామాల్లో పర్యవేక్షించారు

అమరేశ్వరాలయ అర్చకునికి డాక్టరేట్



అమరావతి: ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయం అర్చకుడు ముక్కమల కృష్ణనాగరాజ్ మల్లిక్‌కు కెనడాకు చెందిన బ్రాప్టన్ విశ్వవిద్యాలయం జ్యోతిష్య శాస్త్రంలో 'వక్ర గ్రహాలు–వాటి ఫలితాలు' అనే అంశంపై పరిశోధనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆదివారం ఆయనకు ఆలయ సిబ్బంది, తోటి అర్చకులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. శనివారం కర్ణాటకలోని హోసూరు బ్రాప్టన్ విశ్వవిద్యాలయ భారతదేశ శాఖ స్నాతకోత్సవంలో డైరెక్టర్ డాక్టర్ యేలూరి శ్రీనివాస్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు కృష్ణనాగరాజ్ మల్లిక్ తెలిపారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు




అచ్చంపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ 27వ వార్షికోత్సవాలు రెండవ రోజు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్యవైశ్య విభాగం వారు అఖండ ఏకాహ సంకీర్తన పారాయణం, కలశ క్షీరాభిషేక మహోత్సవం నిర్వహించారు. దేవాలయ ప్రతినిధి సురే సుబ్బారావు దంపతులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళా విభాగం లలిత, గాయత్రీ, వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవార్ల అష్టోత్తర, శతనామార్చనలు చేశారు. ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి దేవరశెట్టి శ్రీనివాసరావు దంపతులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పలు గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాహు కేతువులకు విశేష పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో రాహు–కేతువుల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం రాహు–కేతువులను పూజిస్తే శుభ ప్రదమని భావించి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అర్చకులు కొమ్మురవపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొని, మొక్కులు చెల్లించారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక



పెదకూరపాడు(అమరావతి): పెదకూరపాడు మండల ఎలక్ట్రికల్, ప్లంబింగ్, డ్రైనేజి వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక లాల్ జాన్‌బాషా షాదీఖానాలో జరిగింది. ఈ సమావేశంలో మండల ఎలక్ట్రికల్, ప్లంబింగ్, డ్రెయినేజీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ జబ్బార్, ఉపాధ్యక్షుడిగా దాసరి ఏడుకొండలు, కార్యదర్శిగా షేక్ ఫరూక్, కోశాధికారిగా సీహెచ్ నాగరాజును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

వివక్షకు తావులేకుండా సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు(అమరావతి): ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాల పంపిణీలో కుల, మత, పార్టీ, వర్గాల వివక్షకు తావులేకుంగా అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తున్నట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మండలంలోని హుస్సేన్ నగరం గ్రామ సచివాలయల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి తీసుకురావటంతో అయన వెంటనే స్పందించారు. తన వెంట ఉన్న అధికారులను సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 94శాతం హామీలు అమలు చేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. హుస్సేన్ నగర్‌లో 300 గడపలను సందర్శించి వారికి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. హుస్సేన్ నగర్‌లో రూ.10.38 కోట్ల సంక్షేమం, అభివృద్ధి పథకాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, , సర్పంచ్ మాగులూరి అనిల్‌కుమార్, ఎంపీటీసీ కుంచాలబాబు, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్, వైస్ ఎంపీపీ బాషా, పార్టీ నాయకులు కంకణాల శివాజీ, బచ్చు హనుమంతరావు, కాసా వీరశివుడు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సొలసలో నూరుల్ హుదా మసీదు ప్రారంభం



హుదా సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన మసీదు

యడ్లపాడు: మండలంలోని సొలసలో నూతనంగా నిర్మించిన నూరుల్ హుదా మసీదు ఆదివారం రాత్రి ప్రారంభించారు. చిలకలూరిపేటకు చెందిన హుదా ధార్మిక సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు సెంట్ల విస్తీర్ణంలో రూ.15 లక్షలతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ మసీదు ప్రారంభోత్సవానికి చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు షేక్ తలహాఖాన్, హుదా సొసైటీ వ్యవస్థాపకుడు పఠాన్ అబ్బాస్‌ఖాన్‌నద్వి, గుంటూరు, విజయవాడకు చెందిన మత, గ్రామపెద్దలు హాజరయ్యారు. దువా చేసి మసీదును ప్రారంభించారు. అనంతరం మసీదు ప్రాంగణంలో ఖురాన్ వాక్యాలను, అనంత కరుణామయుడు అల్లాహ్ ఆదేశాలను మతపెద్దలు వివరించారు. హుదా చైర్మన్ అబ్బాస్‌ఖాన్‌నద్వి మాట్లాడుతూ యడ్లపాడు మండలంలో హుదా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఆరో మసీదు సొలస గ్రామంలోనిదని తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మసీదులు నిర్మించడంతో పాటు పేదలకు విద్యా, వైద్యం ఇతర సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న వారికి భారీ అన్నదానం నిర్వహించారు.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

క్రోసూరు: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా క్రోసూరు మండల కో–కన్వీనర్ గా ఊటుకూరు గ్రామానికి చెందిన జెర్రిపోతు రవికిరణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ వైస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృతజ్ఞతలు తెలిపారు.ఆదివారం గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావును కలిసి, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

బీపీ మండల్ విగ్రహానికి ఘన నివాళి

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని బీసీ సంఘ నాయకులు గుంటూరులో ఏర్పాటు చేసిన బీపీ మండల్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ఆదివారం తరలి వెళ్లారు. సత్తెనపల్లి పట్టణంతో పాటు నాలుగు మండలాల నుంచి 30 వాహనాల్లో గుంటూరు చేరుకొని బీపీ మండల్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు తోక మదన్‌మోహన్, తుళ్లూరు శివరామకృష్ణ, నంబుల వెంకటేష్, రామస్వామి, మోహన్, గుంటూరు గోవిందు, నడియా దనపాల్, కందుల అంబేడ్కర్, షేక్ చిన్న షరీఫ్, జిల్లెల పాలరాజ్, పల్లపు ధర్మారావు, గుంజి విజయ్, కంటూ చిన్న బ్రహ్మం, కుమ్మరి దస్తగిరి, సిద్దెల వేణు, గొట్టం వెంకటేష్, టీ స్టాల్ శ్రీను తదితరులు ఉన్నారు.

విపత్తుల సమయంలో వలంటీర్లది కీలకపాత్ర



మాట్లాడుతున్న దిశ సీఐ సుభాషిణి

నరసరావుపేట రూరల్: విపత్తుల సమయంలో వలంటీర్ల పాత్ర కీలకమని దిశ పోలీస్ స్టేషన్ సీఐ సుభాషిణి తెలిపారు. కోటప్పకొండ ఎస్ఆర్‌టీపీ శిక్షణ కేంద్రంలో ఆపదమిత్ర కార్యక్రమంపై నిర్వహిస్తున్న తరగతుల్లో ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు చేరువలో ఉన్న వలంటీర్లు, ఆశ వర్కర్ల వ్యవస్థలను అనుసంధానం చేసి పనిచేయడం ద్వారా విపత్తుల్ని సమర్థంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. విపత్తుల సమయంలో మొదటి ప్రాధాన్యతగా వైద్యం, ఆహారం అందించాలని సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ కె.నాగేశ్వరరావు, డీఆర్పీ డి.నాగేశ్వరరావు, జిల్లాలోని ఆశవర్కర్లు, వలంటీర్లు, దిశ మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరంపాడు దేవస్థానంలో బోరు ఏర్పాటు



రాజుపాలెం: దేవరంపాడు కొండపై వేంచేసిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం తాగునీటి కోసం బోరు పనులు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు భూమి పూజచేశారు. మంత్రి అంబటి రాంబాబు సూచనల మేరకు దాతల సహాయంతో బోరు వేస్తున్నట్లు వారు తెలిపారు. దేవస్థానానికి సహాయ, సహకారాలు అందించాలని కన్వీనర్ శ్రీనివాసరావు దాతలను కోరారు. చీమలమర్రి సొసైటీ అధ్యక్షులు కావేటి రామారావు, కాసర్ల కృష్ణారెడ్డి దేవస్థానం ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి, కోటి మేస్త్రీ, మర్రిపూడి బాజీ తదితరులు ఉన్నారు.

విశ్వకర్మల ఆర్థిక పురోగతికి పథకం దోహదం



కార్యక్రమంలో విశ్వకర్మలతో రామకృష్ణ

నరసరావుపేట: కేంద్ర బడ్జెట్‌లో విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా విశ్వకర్మల ఆర్థిక, సామాజిక పురోగతికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తోడ్పడ్డారని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ పేర్కొన్నారు. పార్టీ ఆర్టిజెన్ సెల్ జిల్లా కన్వీనర్, విశ్వబ్రాహ్మణ సంఘ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సిద్ధు అనంత నాగబ్రహ్మచారి ఆధ్వర్యంలో ఆదివారం నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ 16వ వార్డు శ్రీరాంపురంలోని శ్రీ మద్విరాట పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వకర్మ సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 140 పేర్లతో పిలవబడుతున్న విశ్వకర్మ సంఘీయులకు ఈ పథకం వల్ల ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ అధ్యక్షుడు చంద్రపాటి చెంచు సత్యనారాయణ, విశ్వ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుట్ల శివాచారి, ప్రధాన కార్యదర్శి బొప్పూడి సాయి, యలవర్తి నాగాచారి, బొమ్మిడాకుల సైదాచారి పాల్గొన్నారు.

ప్రత్యేక చొరవ..పనులు శరవేగం

- పూర్తికానున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం
- సీఎం వైఎస్ జగన్‌తో ప్రారంభించేందుకు సన్నాహాలు
- ఎమ్మెల్యే శంకరరావు చొరవతో స్థలం సేకరణ
- తీరనున్న విద్యార్థుల కష్టాలు



నూతన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం



ప్రస్తుతం తరగతులు జరుగుతున్న రేకుల షెడ్డు

క్రోసూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో మండలానికి ఒక కళాశాల ఏర్పాటులో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయటం జరిగింది. అప్పటి నుంచి క్రోసూరు జడ్పీపాఠశాల ప్రాంగణంలోని రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. అనంతరం కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల పాలనలో కళాశాలకు సొంత భవనం నోచుకోలేదు. భవన నిర్మాణానికి నిధులు రూ.7.25కోట్లు సిద్ధంగా ఉన్నప్పటికీ స్థలం చూపించలేక పోవటంతో భవన నిర్మాణ పనులు మొదలు కాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలువుదీరాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళాశాల భవన నిర్మాణంపై దృష్టి సారించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవ చూపి తక్షణమే 4.25 ఎకరాల స్థలం కేటాయించారు. రూ.7.25 కోట్ల నిధులతో భవన నిర్మాణ పనులు ప్రారంభయ్యాయి. ప్రిన్సిపల్ కార్యాలయం, స్టాఫ్, ఆఫీస్ రూం, ల్యాబ్స్ విద్యార్థుల తరగతుల కోసం మొత్తం 26 గదులు నిర్మిస్తున్నారు. దాదాపుగా పనులు పూర్తికావొచ్చాయి. త్వరలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కళాశాల భవనాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సన్నాహాలు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో రెండు కోర్సులు

క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు కోర్సులు నిర్వహిస్తున్నారు. అవి డిప్లొమా ఇన్ సివిల్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్. కోర్సుకు 60 సీట్లు చొప్పున పాలిసెట్ ద్వారా విద్యార్థులు ఏటా అడ్మిషన్ పొందుతున్నారు. మూడేళ్ల కోర్సు తర్వాత నేరుగా ఇంజినీరింగ్(బీటెక్) రెండవ సంవత్సరంలో విద్యార్థులు చేరే అవకాశం ఉంది. పాలిటెక్నిక్ కళాశాలలకు బీసీ హాస్టల్ కూడా ఉంది. కళాశాలకు సొంత భవనం నిర్మాణం కావొస్తుడటంతో విద్యార్థుల కష్టాలు త్వరలో తీరనున్నాయి.

గతంలో ఎవరూ చేయని అభివృద్ధి చేశాం



పెదకూరపాడు నియోజకవర్గంలో గతంలో ఎవరూ చేయలేని అభివృద్ధి పనులు కేవలం మూడున్నరేళ్ల పాలనలో చేసి చూపించాం. అమరావతి – బెల్లంకొండ డబుల్ రోడ్డు, మాదిపాడు బ్రిడ్జి శంకుస్థాపనలు, క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాల భవనం ప్రారంభోత్సవాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– ఎమ్మెల్యే నంబూరుశంకరరావు, పెదకూరపాడు.

పేదల సొంతింటి కల సాకారం చేసిన జగనన్న

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఇళ్ల పట్టాలు తీసుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: నివేశన స్థలాలు ఇచ్చి, వాటిలో ఇళ్ల నిర్మాణం చేపడుతూ.. పేదల సొంతింటి కల నిజం చేస్తున్న సీఎం జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే నంబూరు శంరరావు పేర్కొన్నారు. మండలంలోని లేమల్లె వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్మించిన గృహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 30 లక్షలకు పైగా నివేశన స్థలాలు ఇచ్చి వాటిలో మౌలికవసతులు కల్పించడమే కాకుండా..ఇళ్లు కూడా నిర్మించి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. తమ పాలనలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వని వారు నేడు సీఎం వైఎస్ జగన్ యజ్ఞంలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై విమర్శలు చేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అర్హులైన 20 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, పది మంది డప్పు కళాకారులకు డప్పులు పంపిణీ చేశారు. తొలుత జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తిచేసి, గృహప్రవేశం చేసిన బూతపాటి ప్రమీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ హరిబాబు, గ్రామ సర్పంచ్ ఉగ్గం పున్నమ్మ, ఎంపీటీసీ నాగుల్ మీరావలి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంపా జ్వాలాలక్ష్మీ నరసింహరావు, నంబూరు బాబురావు, అళ్ల శ్రీనివాసరెడ్డి, చిలకా సాంబయ్య, మంగిశెట్టి కోటేశ్వరరావు, ఉగ్గం యలమంద తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో సామాజిక భవన నిర్మాణాలు పూర్తిచేస్తాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: క్రోసూరు ఎస్సీ కాలనీలో రూ.25 లక్షల నిధులతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవనానికి ఎంపీ నిధులు కేటాయించినట్లు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 33 కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.5.85 కోట్లు నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. వీటిలో కొన్ని పూర్తయ్యాయని, మరొకొన్ని నిర్మాణ దశలో ఉన్నట్లు చెప్పారు. ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాలు నిర్మాణం మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఆరు నెలల్లో నియోజకవర్గంలోని అన్ని భవన నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఎల్‌సీ ఫాదర్ రెవ, సుందరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గార్లపాటి దాసు, ఎంపీపీ పి.కోటయ్య, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, ఎంపీటీసీ చిల్కా రవి, నారు శ్రీనివాసరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, మేదర రోశయ్య, అనుముల కోటిరెడ్డి, గంజినబోయిన శ్రీనివాసరావు, వేణుగోపాలరెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, బయ్యవరం మస్తాన్‌రావు, డాక్టర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ అనూషకు ఆర్థిక సాయం



అనూషను సత్కరిస్తున్న రామకృష్ణ, వైద్యులు, తదితరులు

సత్తెనపల్లి: అథ్లెటిక్ అనూషకి సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సాయం స్థానిక వైద్యశాలలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన మల్లాల అనూష ఒక నిరుపేద కుటుంబం నుంచి జాతీయ స్థాయి అథ్లెటిక్‌గా ఎన్నో పతకాలు సాధించి, ఇప్పుడు ఏషియన్ గేమ్స్ కి క్వాలిఫై అయ్యిందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులో శిక్షణ తీసుకుంటున్న అనూష ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని స్నేహితుడి ద్వారా తెలుసుకొని.. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు రూ.6 వేలు, మచ్చా తిరుపతిరావు రూ.5 వేలు, కొత్త రామకృష్ణ రూ.9 వేలు మొత్తం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అనూషని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ రాజమోహన్ రెడ్డి, డాక్టర్లు, స్టాఫ్ నర్సులు సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



చేజర్ల గ్రామంలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

నకరికల్లు: త్రైత సిద్ధాంత భగవద్గీత పఠనం ద్వారా జ్ఞానం లభించి, మోక్షం పొందే మార్గం సిద్ధిస్తుందని ప్రబోధ సేవా సమితి చిలుకలూరిపేట కమిటీ అధ్యక్షుడు యడ్లనపూడి వీరాంజనేయులు తెలిపారు. మండలంలోని చేజర్ల, జిల్లాపేటతండాలలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధగ్రంథాల పఠనం ద్వారా స్వామివారి ప్రసంగాలు తెలుసుకొని ప్రజలందరూ ఆత్మజ్ఞానం పొందవచ్చన్నారు. అనంతరం ఇంటింటా గ్రంథ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రాకేష్, ఆంజనేయులు, విక్రమ్, నాగేశ్వరరావు, ఆకాష్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



నగదు చెక్కు అందజేస్తున్న సభ్యులు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి హరి మిత్రమండలి సభ్యులు ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద నివాసం ఉంటున్న కూలీ గోపీ నాయక్ దురదృష్టవశాత్తు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యి..తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి తెలుసుకున్న హరి మిత్ర మండలి అధ్యక్షుడు సదనం హరి నగదు చెక్కును గోపీనాయక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. సత్తెనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, సభ్యులు తోట స్వామి, మస్తాన్, వినయ్, మల్లి ఉన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1986–89లో బీఏ చదివిన విద్యార్థులు దాదాపు 33 సంవత్సరాల తరువాత ఒకచోట చేరి తమ అనుభవాల్ని పంచుకున్నారు. తమ అభ్యున్నతికి కృషి చేసిన అప్పటి అధ్యాపకుల్ని ఘనంగా సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. కార్యక్రమంలో అప్పటి కళాశాల అధ్యాపకులు ఎం.ఆర్.కె.మూర్తి, కె.రాజశంకరరావు, బి.శివధర్మశాస్త్రి, ఏ.హరిహరనాథశాస్త్రి, ఈ.ఎం.స్వామి, గ్రంథాలయాధికారి కె.వి.కె.రామారావు, ప్రస్తుత పాలకవర్గ అధ్యక్షుడు కె.వి జయకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమాల్ని పూర్వ విద్యార్థులైన ఎన్‌సీసీ మేజర్ బి.ఎస్.ఆర్.కె. రాజు, బి.వి.ఎస్.కామేశ్వరశాస్త్రి, బి.వి.కామేశ్వరశాస్త్రి, షేక్ కరీముల్లా, ఎ. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వైభవంగా కలశ ప్రతిష్ట

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయ శిఖర కలశ ప్రతిష్టను ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితుడు చేజర్ల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛారణతో సంప్రదాయ బద్ధంగా జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.